ప్రజాశక్తి

ఆదివారం 19 ఫిబ్రవరి 2023 5 శ్రీ సత్యసాయి



లేపాక్షిలో హైకోర్టు న్యాయమూర్తి


హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న ఎస్పీ


ప్రజాశక్తి-లేపాక్షి

ప్రముఖ పర్యాటక కేంద్రం అయిన లేపాక్షికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద శనివారం విచ్చేశారు. ఈయన్ను జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ కలిసి స్వాగతం పలికారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి లేపాక్షి ఆలయాన్ని సందర్శించారు. దుర్గా వీరభద్ర పాపాన్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అధికారులు లేపాక్షి విశిష్టత, కట్టడాలు, శిల్ప కళావైభవం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాబు, సిఐ వేణుగోపాల్, ఎస్ఐ మునీర్ అహమ్మద్, ఇఒ నరసింహామూర్తి ఉన్నారు.

మార్గదర్శకాలు వచ్చాయి.. బ్యాగులు రాలేదు..!

◆ పప్పుశనగ సేకరణకు ఇబ్బంది

◆ అయోమయంలో రైతులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వర్షాలు బాగా రావడంతో రబీలో పప్పుశనగ పంట కొంత ఆశాజనకంగానే వచ్చింది. ఎకరానికి ఏడు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. అయితే వచ్చిన పంటను అమ్ముకోవడానికి వెళితే మద్దతు ధర లభించ లేదు. క్వింటా పప్పుశనగకు రూ.5330గా కనీస మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. అయితే రూ.4500 వరకే మార్కెట్‌లో ధర లభిస్తోంది. దీంతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కూడా కొనుగోలు చేస్తున్నట్టు చెబుతోందిగాని ఆచరణలో అవసరమైన ఏర్పాట్లు ఇంకా పూర్తవలేదు. రైతు భరోసా కేంద్రాల్లో నమోదు వరకే పరిమితమవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ ఏడాది 1.60 లక్షల ఎకరాల్లో పప్పుశనగ పంట సాగైంది. పంట చేతికొచ్చి రైతులు అమ్మకానికి సిద్ధంగానున్నారు.

ఇంకా రాని బ్యాగులు

పప్పుశనగ కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేసింది. ఈ మేరకు అనంతపురం జిల్లాలో 19 వేల క్వింటాళ్లు, సత్యసాయి జిల్లాలో 200 క్వింటాళ్లు సేకరించాలని నిర్ణయించింది. అయితే సేకరణకు ప్రధాన అవరోధం గోనె సంచుల్లేకపోవడం. మార్గదర్శకాల్లో పేర్కొన్న ప్రకారంలో గతంలో లాగా కాకుండా క్యూఆర్ కోడ్ కలిగిన సంచుల్లోనే సేకరించాలని నిర్దేశించింది. ఇవి అందుబాటులో ముందుస్తుగా తేలేదు. మార్గదర్శకాల అనంతరం ఆర్డర్ ఇచ్చారు. లక్ష గన్ని బ్యాగులకు ఆర్డర్ పెట్టినట్టు మార్కెఫెడ్ అధికారులు చెబుతున్నారు. ఇవి ఎప్పటికి జిల్లాకు చేరుతాయన్నది చూడాల్సి ఉంది. అవి రాకుండా సేకరణ సాధ్యమయ్యే అవకాశం లేనట్టు కనిపిస్తోంది. అంతేకాకుండా రవాణాకు సంబంధించి కూడా ధర ఇంకా నిర్ణయం జరగనట్టు సమాచారం. సేకరణ చేసిన దగ్గరి నుంచి గోడౌన్‌కు చేర్చే వరకు అయ్యే రవాణా ఖర్చుకు సంబంధించి ధరను ప్రభుత్వం ఇంకా నిర్ధారించనట్టు తెలుస్తోంది. ఈ రెండు ప్రధాన కారణాలతో సేకరణ కేవలం ప్రకటనకే పరిమితమైంది.

సమయం ముగిశాకా...

రైతులు పంట నూర్పిడి చేసే సమయానికి సేకరణ ప్రారంభమయితే వాటిని అమ్ముకుని రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రారంభం ఆలస్యమయితే రైతులు పంటను నిలువ ఉంచుకోలేక ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకునే పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రభుత్వం కొనుగోలు ప్రారంభించకపోవడంతో రైతులు వ్యాపారులపైనే ఆధారపడాల్సి వస్తోంది. దీంతో వారు చెప్పిన ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది. అంతా అమ్ముకున్నాక ప్రభుత్వం కొనుగోలు ప్రారంభించినా పెద్దగా ప్రయోజనముండదని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు.

త్వరితగతిన కొనుగోళ్లు ప్రారంభించాలి

ప్రభుత్వం పప్పుశనగ పంట సాధ్యమైనంత త్వరగా కొనుగోలు ప్రారంభించాలి. నూర్పిడి పూర్తయ్యే సమయానికి ప్రారంభిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుంది. లేకపోతే పంట నిలువ చేసుకునే వీళ్లేని రైతులు ప్రయివేటు వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. సరైన సమయంలో ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభిస్తే రైతులకు ప్రయోజనం ఉంటుంది.

చంద్రశేఖర్‌రెడ్డి,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.


జెఎన్‌టియులో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అనంత ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ, అనంతపురం స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను రిటర్నింగ్ అధికారి, ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. శనివారం ఉదయం జేఎన్టీయూలో కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనమండలి ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ బాక్స్‌ల భద్రత, స్ట్రాంగ్ రూమ్ ఎంపిక, ఓట్ల లెక్కింపునకు అవసరమయ్యే గదులు, అక్కడ వసతుల ఏర్పాట్లు, బ్యారికేడింగ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలకు సంబంధించి మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, దానికి తగిన ఏర్పాట్లు వెహికల్ పార్కింగ్‌కు సంబంధించి స్థల పరిశీలన చేసి సరైన బారికేట్లతో ఏర్పాట్లు చేపట్టాలని పోలీసు సిబ్బంది ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి సీసీ కెమెరాలు ఎల్లవేళలా కౌంటింగ్ పూర్తయ్యే వరకు పర్యవేక్షణలో ఉంచాలని తెలిపారు. కౌంటింగ్ హాల్లో సరైన క్రమంలో టేబుల్స్, ఫెన్సింగ్, రెండు వైపులా రాకపోకలు ఉండేలా ఏర్పాటు చేయాలని, చీఫ్ ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన సూచనలు మేరకు కౌంటింగ్ సక్రమంగా జరపాలని సంబంధిత అధికారులకు తెలిపారు. రెవెన్యూ అధికారులు కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ గాయత్రి దేవి, అనంతపురం రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, జేఎన్టీయూ ప్రొఫెసర్ చంద్రమోహన్ రెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి, ఈఈ ప్రసాద్ రెడ్డి, డిఈ బాల కాటమయ్య, నోడల్ అధికారులు నాగేశ్వర్ రెడ్డి, హరికుమార్, స్థానిక తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


వీరగల్లు శాసనాన్ని పరిశీలిస్తున్న చారిత్రక పరిశోధకుడు మైనాస్వామి

వెలుగులోకి వచ్చిన అరుదైన వీరగల్లు శాసనం


గుర్తించిన చారిత్రక పరిశోధకుడు మైనాస్వామి

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని వానవోలులో వెలసిన రంగనాథ స్వామి ఆలయాన్ని పరిశీలించాలన్న గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు శనివారం పర్యటించగా ఓ చెత్తకుప్ప పక్కన పడి ఉన్న అరుదైన రాతి స్తంభంపై వీరగల్లు శాసనం కనిపించింది. ఈ వీరగల్లు క్రీస్తుశకం 1405 సంవత్సరం నాటిదిగా చారిత్రక పరిశోధకుడు మైనాస్వామి మైనాస్వామి గుర్తించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. వీరగల్లు నాలుగు విభాగాలుగా ఉందని, రెండో భాగంలో ఒక శాసనం, చివరి భాగంలో మరో శాసనం ఉన్నట్లు తెలిపారు. ఈ వీరగల్లు సుమారు 8 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పు, రెండు అడుగుల మందంతో ఉందన్నారు. మొదటి భాగంలో వీరుడు శివుని పక్కగా ఉండగా, శివుని మరోవైపు నంది వాహనం కూర్చొని ఉంది. దిగువ భాగంలో వీరుడు-వీరుని భార్య సతీసహగమనం చేయడానికి ముందు వీడ్కోలు తీసుకుంటున్నట్లు శిల్పాన్ని మలిచారని వివరించారు. వారు ఒక వేదికపై కూర్చున్నారు. వారివారికి కుడివైపునున్న ఒక స్తంభం చాలా అరుదుగా ఉంది. ఇందులో ఒక చేయి శాసనాన్ని చూపిస్తోందన్నారు. కింది భాగంలో వీరుడు నిలబడుకుని ఉండగా మరోవైపు గుర్రాన్ని నిలువరిస్తున్నాడు. శిల్పాల కింద శాసనంలో సతీసహగమనానికి సంబంధించిన వివరాలు ఉన్నాయన్నారు. స్వస్తిశ్రీ జయ అభ్యుదయ శకవర్ష 1327 పార్థివ సంవత్సరం అని శాసనం మొదలవుతుందన్నారు.. శాసనం కన్నడ భాషలో ఉందన్నారు. ఇంగ్లీషు తేదీ ప్రకారం క్రీస్తుశకం 1405లో వీరుడు వీర మరణం పొందినందుకు గుర్తుగా ఈ వీరశిలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విజయనగర సామ్రాజ్యాన్ని రెండో హరిహరరాయలు పరిపాలిస్తున్న కాలంలో పెనుకొండలో జరిగిన ఒక యుద్ధంలో రామచంద్ర దేవా నాయకరు అనే ఒక వీరుడు వీరమరణం పొందాడని వివరించారు. రామచంద్ర దేవా భార్య గంగసాని భర్తతోపాటు సతీసహగమనం చేసినట్టు శాసనం చెబుతోందన్నారు. గంగసాని పామిడికి చెందిన వ్యాపారి బయన్న శెట్టి కుమార్తె అని, రామచంద్రదేవా నాయకునిది బహుశా వానవోలు స్వస్థలం అయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. అందువల్లే అరుదైన వీరగల్లు ఆయన స్మారకార్థం వానవోలులో వెలసినట్టు చారిత్రక పరిశోధకుడు మైనా స్వామి తెలిపారు. ఇలాంటి అరుదైన వీరజల్లులను సమీప ప్రాంతంలోని పురావస్తు ప్రదర్శనశాలకు తరలించి పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.


బయటపడిన వీరగల్లు శాసనం

గుత్తిలో సమస్య... జఠిలం



◆ గుత్తి మున్సిపాల్టీలో దాహం కేకలు

◆ నెలకు రెండుసార్లే తాగునీటి సరఫరా

◆ 6 వార్డుల ప్రజలకు ఏళ్ల తరబడి ఉప్పు నీరే గతి

◆ నత్తనడకన రూ.173 కోట్ల మిడ్ పెన్నార్ ప్రాజెక్టు నిర్మాణ పనులు

ప్రభుత్వాలు మారుతున్న గుత్తి మున్సిపాల్టీ ప్రజల తాగునీటి కష్టాలు తీరడం లేదు. ప్రజా ప్రతినిధుల అలసత్వం అధికారుల నిర్లక్ష్యం వెరసి గుత్తి పురపాలక సంఘంలో ప్రజలకు తాగేందుకు గుక్కెడు నీరు కరువైంది. ఆరు నెలలకోసారి నీటి పన్నులు వసూలు చేసి మున్సిపాలిటీ ఆదాయం పెంచుకుంటున్నా, పట్టణవాసులకు తాగునీరు మాత్రం సరఫరా చేయని దుస్థితి ఉంది. ఒక్కో కుటుంబానికి రోజుకు ఐదు బిందెల నీరు కూడా సరఫరా చేయడం లేదంటే ఇక్కడి నీటి సమస్య ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.


చెర్లోపల్లి కాలనీలో మరమ్మతుకు గురైన స్పాట్ డెలివరీ ట్యాంక్

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మున్సిపాల్టీలో 25 వార్డులు ఉన్నాయి. సుమారు 60 వేల జనాభా ఉంది. గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లో దాదాపు 7500 తాగునీటి కుళాయిలు ఉన్నాయి. సత్యసాయి తాగునీటి ప్రాజెక్టు, ఎర్రతిమ్మరాజు చెరువు (వైటీసీ) తాగునీటి ప్రాజెక్టుల ద్వారా మున్సిపాల్టీ ప్రజలకు నీటిని సరఫరా చేస్తోంది. సత్యసాయి తాగునీటి ప్రాజెక్టు నుంచి 25 లక్షల లీటర్లు, ఎర్ర తిమ్మరాజు చెరువు ప్రాజెక్టు నుంచి 15 లక్షల లీటర్లు నీరు ప్రతి రోజూ సరఫరా అయ్యేది. జిల్లా ప్రజల దాహార్తి తీర్చడానికి 28 ఏళ్ల క్రితం పుట్టపర్తి సాయిబాబా తాగునీటి ప్రాజెక్టును ఈ ప్రాంతంలో ప్రారంభించారు. గుత్తి, ఆర్ఎస్ ప్రజలకు తాగునీరు అందించేందుకు పామిడి వద్ద పెన్నా నదిలో బోర్లు వేసి, పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా చేసేవారు. వెయ్యి లీటర్లకు రూ.5 చొప్పున గుత్తి, చెట్నేపల్లి గ్రామ పంచాయతీల నుంచి నిర్వహణ ఛార్జీలు తీసుకొనేవారు. రెండు రోజులకోసారి తాగునీరు సరఫరా అయ్యేది. పంచాయతీ అధికారులు నిర్వహణ ఛార్జీలు పూరిస్థాయిలో చెల్లించకుండా నిర్లక్ష్యం చేశారు. ఇలా సత్యసాయి, వైటిసి ప్రాజెక్టుల నిర్వహణ ఛార్జీల బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి.

ముందస్తు చర్యలు శూన్యం..

తాగునీటి సమస్యపై అధికారులు ముందస్తు చర్యలు లేకపోవడం వల్ల మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రం అయ్యింది. ప్రస్తుతం సత్యసాయి ప్రాజెక్టు నుంచి 15 లక్షల లీటర్లు, వైటిసి నుంచి 2 లక్షల లీటర్ల తాగునీరు మాత్రమే సరఫరా అవుతోంది. ఆ నీరు గుత్తి, గుత్తి ఆర్ఎస్ ప్రజలకు ఏ మాత్రం సరిపోవడంలేదు. రోజూ ఒక్కొక్కరికి 70 లీటర్ల తాగునీరు అందించాలన్న లక్ష్యం రికార్డులకే పరిమితమైంది. వార్డుల్లో ఏర్పాటు చేసిన స్పాట్ డెలివరీ ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్న నీటితోనే ప్రజలు కాలం వెళ్లదీస్తున్నారు. పట్టణంలోని 10,11,12,13,15,21వ వార్డుల్లోని కాలనీవాసులు ఏళ్ల తరబడి ఉప్పునీరే తాగుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 120 స్పాట్ డెలివరీ ట్యాంకులు ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో ఈ ట్యాంకర్లూ మరమ్మతుకు గురయ్యాయి.

మున్సిపాల్టీగా మారాక మరింత జఠిలం

2011లో ప్రభుత్వం గుత్తి, చెట్నేపల్లి గ్రామ పంచాయతీలను కలిపి మున్సిపాల్టీగా ప్రకటించింది. అప్పటి నుంచి తాగునీటి సమస్య మరింత జఠిలమైంది. ఆరు నెలలకోసారి మున్సిపాల్టీకి నీటి పన్నులు చెల్లిస్తున్నా ప్రజలకు తాగునీటి కష్టాలు మాత్రం తప్పలేదు. ప్రజా ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ అధికారులు గతంలో లక్షలాది రూపాయలు వెచ్చించి పెన్నానది వద్ద బోర్లు వేశారు. అయినా తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. పైపులైన్లు పాతవి కావడంతో తరచూ ధ్వంసం అయ్యి, నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ప్రస్తుతం 15-20 రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోంది. ఈ నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోవడం వల్ల పురుగులు పడుతున్నాయి. ఆ నీరు తాగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. సత్యసాయి 4 ప్రాజెక్టు నుంచి గుత్తి మున్సిపాలిటీతో పాటు పెద్దవడుగూరు, పామిడి మండలాల్లోని 19 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. వైటిసి ప్రాజెక్టు నుంచి 22 గ్రామాలతో పాటు గుత్తి మున్సిపాలిల్టీకి కూడా తాగునీరు సరఫరా చేస్తున్నారు.


నత్తనడకన సాగుతున్న వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్

నీటి ట్యాంకర్ల బిల్లులూ పెండింగ్..!

తాగునీటి సరఫరా చేసే ట్యాంకర్లు 10 ఉండగా వాటికి సంబంధించిన రూ.20 లక్షల బిల్లులు ఏడాదిగా బకాయి ఉండడంతో ట్యాంకర్ల నిర్వాహకులు తాగునీటిని సరఫరాను ఆపేశారు. ఆరు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ ఆరు ట్యాంకర్లతో ఇంటికి కనీసం ఐదు బిందెల నీరు కూడా సరఫరా చేయని దుస్థితి ఉంది. శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నామని ప్రజా ప్రతినిధులు చెబుతున్నా ఆచరణకు ఇది నోచుకోలేదు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ వన్నూరుబి ఎన్నికైన వార్డులో కౌన్సిలర్లు లక్ష్మీరాణి, వాల్మీకి శివ నివాసం ఉంటున్న చెర్లోపల్లి కాలనీల్లో మూడు వారాలుగా తాగునీరు సరఫరా కావడం లేదు. ఇక్కడ రెండు స్పాట్ డెలివరీ ట్యాంకులు మరమ్మతుకు గురయ్యాయి. నాలుగు రోజులు గడుస్తున్నా వాటిని ఎవరూ పట్టించుకోలేదు. 25 వార్డులో రెండు నెలలకు ఒకసారి మాత్రమే సత్యసాయి బాబా ప్రాజెక్టు నీరు సరఫరా చేస్తున్నారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. పది రోజులకోసారి ఉప్పునీటిని సరఫరా చేస్తున్నారు.

నత్తనడకన 'మిడ్‌పెన్నార్ ప్రాజెక్టు' పనులు

ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టెమెంట్ బ్యాంకు (ఎఐఐబి) రుణంతో మున్సిపాల్టీకి రూ.173 కోట్లతో మిడ్ పెన్నార్ ప్రాజెక్టు మంజూరైంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే రోజూ తాగునీరు సరఫరా చేస్తామని అధికారులు అంటున్నారు. అయితే రెండేళ్ల క్రితం ప్రారంభమైన ప్రాజెక్టు పనులు ఇప్పటికీ నత్త నడకన సాగుతున్నాయి. పట్టణ శివారులోని గుత్తి -అనంతపురం రోడ్డు సమీపంలో 11 ఎమ్ఎల్‌డీ సామర్థ్యం గల వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్.పల్లి, చెర్లోపల్లి కాలనీ, బీసీ కాలనీ వద్ద హెడ్ ఓవర్ ట్యాంకులను నిర్మించాల్సి ఉంది. మిడ్‌పెన్నార్ జలాశయం నుంచి గుత్తి వరకు పైప్ లైన్ నిర్మించాలి. గుత్తి నుంచి ఆర్ఎస్ వరకు అరకొరగా పైపు లైన్ నిర్మాణం చేపట్టారు. మున్సిపాల్టీలోని అన్ని కాలనీల్లో జీపీ కన్స్ట్రక్షన్స్ పైప్ లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మిడ్‌పెన్నార్ ప్రాజెక్టు పనులు ఎప్పుడు పూర్తవుతాయన్న దానిపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులకే స్పష్టత లేని పరిస్థితి ఉంది. ఇన్ని సమస్యల నడుమ గుత్తి మున్సిపల్ వాసులు నిత్యం నీటి సమస్యతో సతమతం అవుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వీడి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

వేసవి దృష్ట్యా ముందస్తు చర్యలు

నీటి సరఫరాకు సంబంధించి పైపులు పాతవి కావడంతో పామిడి నుంచి గుత్తి పట్టణం వరకు పది ప్రాంతాల్లో లీకేజీలు ఉన్నాయి. తరచూ పైపులైన్లు ధ్వంసం కావడంతో మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. రానున్న వేసవికాలం తాగునీటి సమస్య పరిష్కారం కోసం ముందస్తు చర్యలు చేపట్టాం. రూ.15 లక్షలు వ్యయం చేసి వివిధ ప్రాంతాల్లో బోర్లు వేసి వాటి ద్వారా తాగునీటిని సరఫరా చేస్తాం. ఎఐఐబి రుణంతో చేపట్టిన మిడ్ పెన్నార్ ప్రాజెక్టు పూర్తయితే ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటిని సరఫరా చేస్తాం.

శరత్ చంద్ర,
ఇన్‌ఛార్జి కమిషనర్, గుత్తి.

చంద్రబాబుకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే అడ్డంకులు

టిడిపి ఆధ్వర్యంలో నిరసనలు



పెనుకొండలో అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

సిఎం జగన్ నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలపైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని టిడిపి నాయకులు వాపోయారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అనపర్తి సభకు పోలీసులు అనుమతి ఇచ్చి మళ్లీ రద్దు చేసి అడ్డుకోవడాన్ని నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు చాలా దగ్గరలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటరాముడు, పట్టణ అధ్యక్షుడు రవిశంకర్, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి హుజూర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రామలింగ, జిల్లా ఆఫీసు సెక్రటరీ సాయి ప్రసాద్, ముస్లిం మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రియాజ్, ఉపాధ్యక్షుడు వాజిద్, పట్టణ ప్రధాన కార్యదర్శి వలీవల్, జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి షౌకత్, ముస్లిం మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు పర్యటనలకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు అడ్డంకులు సృష్టించారని టిడిపి నాయకులు విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో చంద్రబాబు సభను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ శనివారం స్థానిక కళాజ్యోతి సర్కిల్లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చంద్రబాబుపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రతిపక్షాలపై పోలీసుల ద్వారా విధిస్తున్న నిర్బంధాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనపర్తి సభకు పోలీసులు అనుమతి మంజూరు చేసి.. రద్దు చేయడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. వైసిపి తుగ్లక్ చర్యలను మానుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నాయకుని హోదాలో జగన్ పాదయాత్ర చేసేటప్పుడు చంద్రబాబు కనుసైగ చేసి ఉంటే ఒక్క అడుగు ముందుకేసేవారా.. అని ప్రశ్నించారు. వచ్చేది టిడిపి ప్రభుత్వమేనని, ఏకపక్షంగా వ్యవహరించిన కొంతమంది అధికారులపై జ్యుడిషియల్ విచారించి చట్టం ముందు దోషులుగా నిలబెట్టాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, పోతుకుంట లక్ష్మన్న, కోడుకుంట రమేష్, క్రిష్టాపురం జమీర్ అహమ్మద్, పరాన్ బాబూఖాన్, వరదరాజులు, గోసల శ్రీరాములు, మారుతిస్వామి, షామీర్, భీమలరామాంజి, భీమల నాగరాజు, బీరే శీనా, బిల్లే శీనా, కటికెల రాజా, తొగట నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని టిడిపి నాయకులు విమర్శించారు. టిడిపి అధినేత చంద్రబాబు అనపర్తి పర్యటనకు అడ్డంకులు సృష్టిస్తూ అడ్డుకోవడాన్ని నిరసిస్తూ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆదేశం మేరకు శనివారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా ప్రజల సమస్యలు తెలుసుకోవడంలో భాగంగా అనపర్తిలో పర్యటిస్తుంటే పోలీసులు అనుమతించినట్లు అనుమతించి ప్రభుత్వానికి అనుకూలంగా అడ్డంకులు సృష్టించడం బాధాకరమన్నారు. జగన్ పాదయాత్ర చేసినప్పుడు సిఎంగా చంద్రబాబు అనుకుని ఉంటే చేసేవారా.. అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రతిపక్ష నాయకులు పాదయాత్ర చేస్తుంటే పోలీసులతో ప్రభుత్వం అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ తెలుసుకుని ప్రతిపక్ష నాయకుల యాత్రలకు సహకరించాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రాజశేఖర్‌బాబు, పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజా సమస్యలు గాలికి వదిలేసి ప్రతిపక్ష నాయకుడిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం ఏంటని తెలుగు యువత మండలాధ్యక్షుడు కావడి ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా పర్యటనను అడ్డుకోవడం బాధాకరమన్నారు. చంద్రబాబుకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. మైక్ తొలగించి, విద్యుత్‌ను తీయించి, జనరేటర్‌ను స్వాధీనం చేసుకుని పలు రకాల ఇబ్బందులకు గురిచేసినా మొబైల్ ఫోన్ లైట్ల వెలుగులో ప్రసంగించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా సిఎం స్పందించి ప్రతిపక్ష నాయకులకు గౌరవం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అమరాపురం : శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం హేమావతిలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా కుంకుమార్చన, మంగళ హారతి అనంతరం తీర్థ ప్రసాద వినియోగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ్ తెలిపారు.



వైవి.రావుకు నివాళులర్పిస్తున్న ఎంప్లాయీస్ నాయకులు

వైవి రావు మృతి యూనియన్‌కు తీరనిలోటు

కదిరి అర్బన్ : ఎపిఎస్ పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, ఎపి అమరావతి జెఎసి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి వైవి.రావు మృతి తీరని లోటని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అన్నారు. శనివారం సత్యసాయి జిల్లాల్లోని పలు డిపోల్లో వైవి.రావు మృతికి నివాళులర్పించారు. ఇందులో భాగంగా సత్యసాయి జిల్లా రీజినల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగార్జునరెడ్డి, జివైపి రావు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్యారేజ్ కార్యదర్శి రవి, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ జిలాన్‌ఖాన్, డిపో కోశాధికారి కె.హరికుమార్, రీజినల్ ప్రెసిడెంట్ ఆర్ఎస్ రెడ్డి, డిపో అధ్యక్ష, కార్యదర్శులు దివాకర్, పి.శంకరప్ప, డిపో నాయకులు ఆర్ఎం రెడ్డి, గంగాధర్, ఇమామ్ ఖాసీ, ఎంజె.రెడ్డి, సిద్ధారెడ్డి, ఆచారి, బాష, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు పరామర్శ

రొద్దం : రోడ్డు ప్రమాదంలో గాయపడిన, గుండె శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న బాధితులను ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ శనివారం పరామర్శించారు. ముందుగా మండలంలోని నారనాగేపల్లి గ్రామానికి చెందిన వెక్తి మహమ్మద్ రఫిక్ కియా అనుబంధ సంస్థలో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా నరణాగేపల్లి రేషన్ డీలర్ రాగిట మహేశ్వరరెడ్డి భార్య ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటోంది. దీంతో ఆమెను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండలం కన్వీనర్ తిమ్మయ్య, ఎంపిపి చంద్రశేఖర్, రవిశేఖర్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

మొదలైన మండలి పోరు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఫిబ్రవరి రావడంతో జిల్లాలో వాతావరణంలో మార్పు కనిపిస్తోంది. చలి తీవ్రత తగ్గి వేడి మొదలైంది. వాతావరణ మార్పులో లాగానే మండలి పోరుకు ఎన్నికల సంఘం నగారా మోగించింది. దీంతో వాతావరణం లాగానే రాజకీయ వేడి కూడా మొదలైంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఎన్నికల నగరా మోగింది. అంతకుముందున్న కత్తి నరసింహారెడ్డి, వెన్నపూస గోపాల్‌రెడ్డి స్థానంలో ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికలకు అన్ని రాజకీయ పక్షాలు సన్నద్ధమై ఉన్నాయి. ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే పోటీ చేసే అభ్యర్థులు బరిలోకి దిగి ఉన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో పాల్గొన్నారు. ఇప్పుడు నోటిఫికేషన్ కూడా ఈ వారంలో వచ్చింది. మార్చి నెలలో ఎన్నికలు జరుగనున్నాయి. నామినేషన్ల ప్రక్రియ కూడా ఈ వారం నుంచే మొదలైంది. వచ్చే వారంలో మొదటి ఘట్టం కూడా పూర్తవనుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో రాజకీయాలు ఊపందుకుంటున్నాయి. ప్రధాన పార్టీలతోపాటు, స్వతంత్రులు బరిలో దిగనున్నారు. ఇందులో అధికార పార్టీ తరుపున పోటీ చేసే అభ్యర్థుల విజయానికి అప్పుడే ప్రలోభాల పర్వం మొదలైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది వరకే ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి లంచ్ బాక్సులను ఒక ట్రయిల్‌గా బహుమతులు ప్రదానం చేశారన్న ఆరోపణలున్నాయి. ఇక ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి గురువారం రోజు అనంతపురం నగరంలోకి విచ్చేసి ప్రయివేటు పాఠశాలలు,



ఉపాధ్యాయ సంఘాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం, దీన్ని విద్యార్థి సంఘాలు అడ్డుకునే ప్రయత్నం చేయడం పెద్ద దుమారమే రేగింది. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఓటర్ల నమోదులోనూ అధికారపార్టీ తనకున్న బలంతో నకిలీ ఓట్లను పెద్దఎత్తున నమోదు చేసిన ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇంకా ఫైనల్ జాబితా ఓటర్లకు సంబంధించి రాలేదు. అది వస్తే మరింత వివాదం చెలరేగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. నామినేషన్ల ఘట్టం కూడా పూర్తయితే మండలి ఎన్నికల హడావుడి మరింత పెరగనుంది. ఈ వారంలో నామినేషన్ల మొత్తం ఘట్టం పూర్తయి అభ్యర్థులు ప్రచారాలకు సిద్ధమవుతున్నారు. ప్రచార సమయాల్లో పరస్పరం చేసుకునే ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ వాతావరణం వేడెక్కనుంది. ఈ ఎన్నికలు ప్రధానంగా ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రధాన ఓటర్లుగా ఉండనున్నాయి. ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించి కేవలం ఉపాధ్యాయులు మాత్రమే ఉంటారు. గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల మాత్రమే ఉండేవారు. ఈసారి ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా అవకాశం కల్పించారు. కొత్త ఓటర్లకు అవకాశం రావడంతో వీరు ఎటువైపు ఏ రకంగా మొగ్గు చూపుతారన్నది ప్రశ్నార్థకంగా ఉంది. అయితే ప్రయివేటు పాఠశాలల యాజమాన్య సంఘాలకు సంబంధించిన వ్యక్తి రంగంలో ఉండటంతో ఆయన్ను గెలుపుకుంచుకోవడానికి కొంతమంది తీవ్రంగా ప్రయత్నాలు, ప్రలోభాలకు ఆ సంఘం నాయకులు ఒకరు రంగంలోకి దిగి ఉండటం గమనార్హం. ఇక పట్టభద్రులకు సంబంధించి చూస్తే ఈ ఎన్నికల్లో నిరుద్యోగ యువతకు ఏమి చేస్తారన్న దానిపై చర్చ జరగడం లేదు. ప్రభుత్వం ఇప్పటికీ భర్తీ చేస్తామన్న ప్రభుత్వ ఖాళీలేవీ భర్తీ చేయలేదు. కేవలం సచివాలయ ఉద్యోగ నియామకాలు ఒక్కటే చేపట్టింది. తక్కిన పోస్టులే భర్తీ చేయలేదు. అనేక శాఖల్లో ఖాళీలు అలాగే ఉన్నాయి. అదే విధంగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగు వాళ్లను రెగ్యులరైజ్ చేస్తానని చెప్పి అవీ చేయలేదు. ఈ అంశాలేవీ ఈ ప్రచారాల్లో చర్చకు రాకపోవడం గమనార్హం.

గృహసారథులు పార్టీకి మూలస్తంభాలు

ఎమ్మెల్యే శంకరనారాయణ

ప్రజాశక్తి-రొద్దం

గృహసారధులు పార్టీకి మూలస్తంభాలని ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. శనివారం మండలంలోని నారనాగేపల్లిలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి విధివిధానాలను వివరించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కష్టపడి పని చేయాలన్నారు. ముఖ్యంగా సచివాలయ వ్యవస్థ మెరుగుపడడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, కన్వీనర్ బోయ తిమ్మయ్య, సచివాలయాల సమన్వయకర్త ఆర్.ఎ.రవిశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్లు కె.పి.శ్రీనివాసులు, లక్ష్మీనారాయణరెడ్డి, స్థానిక సర్పంచు నాగార్జున, ఎంపిటిసి నాగేంద్రప్ప, బోర్ల లక్ష్మీ నారాయణరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, డీలర్ మహేష్‌రెడ్డి, సోమశేఖర్, గృహసారథులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జాతికి గుర్తింపు తెచ్చిన ఎన్టీఆర్ : టిడిపి

పుట్టపర్తి అర్బన్ : తెలుగు జాతికి, తెలుగు భాషకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత ఎన్‌టి రామారావుదే అని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు జరుపుకోనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రూ.100 నాణెంపై ఎన్టీఆర్ బొమ్మ ముద్రించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తెచ్చిన ఎన్టీఆర్ గృహ నిర్మాణాలు, రూ.2కిలో బియ్యం, మహిళలకు ఆస్తి హక్కు కల్పించారన్నారు. తెలుగు గంగ ద్వారా సీమకు సాగునీరు అందించారని గుర్తు చేశారు. దేశంలో ప్రతిపక్షాలను ఏకం చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని కొనియాడారు. ఈ సమావేశంలో ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి జయప్రకాష్, నాయకులు బేకరీ నాయుడు, మల్లికార్జున, వెంకటరాముడు, వెంకటేష్, ఆంజనేయులు, పాపారెడ్డి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదవితే భవిష్యత్తు మీదే..

ధర్మవరం టౌన్ : ప్రతి విద్యార్థి ప్రణాళికలతో చదివితే భవిష్యత్తు మీదేనని ఎస్‌కెయు ప్రొఫెసర్ మల్లికార్జునరెడ్డి సూచించారు. శనివారం మండల పరిధిలోని నాగలూరు వద్ద ఉన్న రూపారాజా పిసిఎంఆర్ 15వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కెయు ప్రొఫెసర్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలన్నారు. పది పరీక్షలు దగ్గరపడిన నేపథ్యంలో ప్రతి విద్యార్థి బాగా చదువుకుని మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక సాంస్కతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ సురేష్‌కుమార్, పాఠశాల ఛైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్స్ రూపరాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ శైలజారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దళితుల మనోభావాలను దెబ్బతీస్తున్న వైసిపి

ధర్మవరం టౌన్ : వైసిపి ప్రభుత్వం దళితుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తోందని టిడిపి ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశాడు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో చంద్రబాబు పర్యటనను అడ్డుకునే సమయంలో రోడ్డుపై నిరసన తెలుపుతున్న మాజీ మంత్రినక్కా ఆనందబాబును పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం బాధాకరమన్నారు. మాజీ మంత్రి అని కూడా చూడకుండా దళితుడని పోలీస్‌స్టేషన్‌లో కింద కూర్చోబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీన్నిబట్టి చూస్తుంటే ఈ ప్రభుత్వానికి దళితులంటే ఎంత గౌరవమో అర్థమవుతోందన్నారు. దేశంలో ఏరాష్ట్రంలోనూ దళితులను ఇంతగా అవమానించి ఉండరని మండిపడ్డారు.

ఘనంగా శివరాత్రి వేడుకలు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

శివరాత్రి పండుగను పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని శైవ క్షేత్రాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇందులో భాగంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉపవాసాలు పాటించారు. పట్టణంలోని ప్రధాన శివాలయం, సైదాపురం ప్రసన్న ఆంజనేయ స్వామి సన్నిధిలో వెలసిన శివపార్వతుల కళ్యాణం, అడపాల వీధిలో కోదండరామస్వామి ఆలయంలో వెలసిన శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. జాగారాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక సంగీత కార్యక్రమాలు, భజనలు, కచేరీ, హరికథ, సాసల చిన్నమ్మ, తిమ్మమ్మ కథ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే కదిరి ప్రాంతం నుంచి పొలతల పుణ్యక్షేత్రానికి భారీఎత్తున భక్తులు తరలివెళ్లారు.

కొత్తచెరువు : మండలవ్యాప్తంగా మహాశివరాత్రి పండుగను ప్రజలు కన్నుల పండువగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని పురాతన సోమేశ్వర ఆలయం, చెరువు కట్ట వద్ద ఉన్న సంగమేశ్వర ఆలయం, నాగుల కణం వద్ద ఉన్న శివాలయం, మరువ ఆంజనేయుల స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసంలో నెలరోజులపాటు మాగ స్నానాలు చేసి పూజలు నిర్వహించి ఉపవాసంతో పూజలు చేశారు. కాగా మండల పరిధిలోని కేసాపురం రహదారి పక్కన ఉన్న గంగమ్మ ఆలయంలో మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు వెంకటరమణ, గాజుల చంద్రమోహన్, బోయ రాజు, శివ, రామచంద్ర, షరీఫ్, అక్కులప్ప, చెన్నారెడ్డి, చిన్నరాయుడు, వెంకటశివారెడ్డి, పెద్దన్న, నల్లమాడ శంకర్, సైకిల్ షాప్ బాబా, మౌలా, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల కేంద్రంలోని దుర్గా వీరభద్ర పాపానాసేశ్వర నంది ఆలయంలో శనివారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందుల భాగంగా స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, రుద్రహోమం, శివపార్వతుల కల్యాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ నరసింహమూర్తి, ఆలయ అర్చకులు శీనా స్వామి, నరసింహశర్మ, సునీల్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల కేంద్రంతో పలు గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని పురాతనమైన శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు.

ధర్మవరం టౌన్ : మహా శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని శనివారం పట్టణంలోని శివాలయాలన్నీ భక్తులతో కళకళలాడుతున్నాయి. ఇందులో భాగంగా శివానగర్ బచ్చునాగంపల్లి కాశీవిశ్వనాథస్వామి, గాంధీనగర్ సహస్ర సిద్ధరామలింగేశ్వరస్వామి, గీతానగర్, శివకేశవ ఆలయంలో శివునికి అరిగెల వంశస్థులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే కొత్తపేట ఉమామహేశ్వరస్వామి, చెరువుకట్ట సమీపంలోని కాశీ విశాలాక్షి కాశీ విశ్వనాథస్వామి ఆలయాల్లో ప్రధాన అర్చకులు ద్వారకనాథ శర్మ ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. రాత్రికి జాగరణ చేశారు. అలాగే పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామికి భక్తులతో నేరుగా పాలాభిషేకం చేయించారు.



లేపాక్షిలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులు



ధర్మవరంలో నీలకంఠేశ్వరస్వామికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు

శివరాత్రి పర్వదినాన్ని శనివారం పటణంలోని శివాలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఇందులో భాగంగా ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు బారులుదీరారు. రాత్రి జాగరణ చేయడానికి ఆలయాల్లో భజనలు, పౌరాణిక నాటకాలు, తోలుబొమ్మలాటలు, హరికథ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శివానగర్ శివాలయంలో శివుడికి రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకం, హోమాలు తదితర పూజలు చేశారు. అనంతరం పార్వతీపరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి రథోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తదితరులు హాజరై రథాన్ని లాగారు. అలాగే చక్రవర్తి థియేటర్ సమీపంలో ఉన్న కాలభైరవ స్వామి ఆలయంలో ఉదయం నుంచే స్వామివారికి బిల్వార్చన, తులసీ అర్చన తదితర పూజలు చేశారు.

పుట్టపర్తి అర్బన్ : శివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు ప్రత్యేక అలంకరణలతో ముస్తాబయినాయి. ప్రశాంతి నిలయంలో రాత్రి రుద్రాభిషేకం నిర్వహించారు. ప్రశాంతి గ్రామ్ వద్ద నిర్మించిన శివలింగం వద్ద రాత్రికి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. ఊరూవాడ రాత్రంతా శివ నామజపంతో జాగారణ చేశారు.

నేరాలు ఘోరాలు

చెట్టు పైనుంచి పడి బాలుడు మృతి



మృతిచెందిన నవీన్ (పాతచిత్రం)

రొద్దం : కొబ్బరి చెట్టు మీద నుంచి పడి బాలుడు మృతిచెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రొద్దకంపల్లి గ్రామానికి చెందిన బోయ నరేష్ కుమారుడు నవీన్ (13) మండల కేంద్రంలో 6వ తరగతి చదువుతున్నాడు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం పొలంలో ఉన్న కొబ్బరి చెట్టుకు టెంకాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు సిఫారసు చేశారు. అక్కడికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.

బావిలో పడి చిన్నారి మృతి



మృతిచెందిన పరమేష్

పుట్టపర్తి అర్బన్ : రెండేళ్ల బాలుడు ఆడుకుంటూ వెళ్లి బావిలో పడి మృతి చెందిన ఘటన శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎనుములపల్లికి చెందిన మహేష్, సాయిలీలా ఒక్కగానొక్క కుమారుడు పరమేష్ (2) ఇంటి ముందు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. తర్వాత గమణించిన తల్లిదండ్రులు బావిలో చూడగా విగతజీవిగా కనిపించాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఒకగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. తల్లిదండ్రులు, బంధువుల ఆర్తనాదాలతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

పెనుకొండ : మండలంలోని వెంకటగిరి పాళ్యంకు చెందిన వైసిపి కార్యకర్త యల్లప్ప శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు చేరుకుని యల్లప్ప మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పెనుకొండ మండల ప్రజాప్రతినిధులు,వైసిపి నాయకులు, తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సిఐ సుబ్బరాయుడు

గోరంట్ల : ద్విచక్ర వాహనంలో మద్యం తీసుకెళ్తున్న బాలకృష్ణనాయక్‌ను శనివారం మండలంలోని గుంతపల్లి సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు సిఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బాలకృష్ణనాయక్ తన ద్విచక్ర వాహనంలో మద్యం తీసుకెళ్తుండగా పట్టుకుని 96 ఐవాట్స్, 90 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

కొత్తచెరువు : మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న కొందరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పేకాట ఆడుతున్నట్లు పక్కాగా అందిన సమాచారం మేరకు శనివారం దాడులు నిర్వహించి లింగారెడ్డిపల్లికి చెందిన ముగ్గురు, పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లికి చెదిన మరో వ్యక్తిని అరెస్టు చేసి రూ.3,750 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. శివరాత్రి పండుగ అని ఎవరైనా పేకాట ఆడినా.. నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

17 ఆర్డీటీ గృహాలు మంజూరు



ఇళ్ల నిర్మాణాలకు కొలతలు వేస్తున్న ఆర్డీటీ సిబ్బంది

రొద్దం : మండలంలోని పెడ్డిపల్లి గ్రామానికి 17 గృహాలు మంజూరైనట్లు ఆర్డీటీ సిబ్బంది తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఇళ్లకు సంబంధించి పునాదులు వేసేందుకు కొలతలు వేశారు. ఒక్కో ఇంటికి రూ.2.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

ఖాద్రీశుడి పోస్టర్లు విడుదల

కదిరి టౌన్ : శ్రీమద్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సంబంధించిన గోడ పత్రికలను ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏటా నిర్వహించే శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మార్చి 2వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారుల సమన్వయంతో ఉత్సవాలుకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్, కార్యనిర్వాహణాధికారి, ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

అన్నదానానికి ఆర్థికసాయం

తనకల్లు : మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని శనివారం మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో వెలసిన జంబులింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదానానికి మండలపరిధిలోని పరాకువాండ్లపల్లికి చెందిన కుంచపు గంగరాజు కుమారుడు డాక్టర్ కుంచపు జయంత్‌కుమార్ విరాళం అందజేశారు. ముందుగా జంబులింగేశ్వర స్వామి ఆలయలంలో కుటుంబ సమేతంగా పూజలు చేశారు. వీరికి ఆలయ కమిటీ ఛైర్మన్ వెంకటరమణ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం దారుణం..

టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ

పెనుకొండ : ప్రభుత్వం తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం చాలా దారుణమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు జగన్ ప్రతిపక్షంలో చేపట్టిన పాదయాత్ర ముందుకు సాగేదా.. అని ప్రశ్నించారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఎపిలో ప్రతిపక్ష పార్టీలు సభలు, సమావేశాలు పెట్టుకునే హక్కు లేదా.. ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్ యాత్రలకు వస్తున్న ప్రజాస్పందన చూసి జగన్ భయపడిపోతున్నారన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి ప్రతిపక్ష నాయకులకు గౌరవం ఇవ్వడంతోపాటు యాత్రలు, సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మాధవ నాయుడు, గుట్టూరు మాజీ సర్పంచి సూర్యనారాయణ, గయప్ప, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు ,త్రివేంద్ర నాయుడు, దాదు మంజు ,నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకురాలు సవితమ్మ